జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 27-3-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 292 పేజీలు: 4 వెల : రూ.7

# ఆపరేషన్ గరుడ.. మొక్కుబడే!



* జిల్లాలో కేవలం నాలుగు మెడికల్ షాపులపైనే దాడులు
* తనిఖీలు అంతా మొక్కుబడే
* డ్రగ్ కంట్రోల్ అధికారికి నచ్చని షాపులపైనే ఈ సోదాలంటూ విమర్శలు
* పలాస అసోసియేషన్ నేత రాజీనామా?

శ్రీకాకుళం, మార్చి 26 (వార్త): ఆపరేషన్ గరుడ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా మందుల షాపులపై దాడులు చేయాలని ఆదేశించడంతో ఈగల్ టీమ్, విజిలెన్స్ ఎండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లోకల్ పోలీస్, డ్రగ్స్ కంట్రోల్ టీమ్ సంయుక్తంగా ఇటీవల దాడులు చేశారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి కేవలం నాలుగు షాపులకు వెళ్లి మందులు పరిశీలించింది. అయితే డ్రగ్ కంట్రోల్ అధికారులు గతంలో ఎన్నడులేనివిధంగా ఇతర శాఖలను భాగస్వామ్యం చేసి దాడులు చేయడం అన్ని వర్గాల్లో చర్చనీయాంశమైంది. జిల్లాలో వందల సంఖ్యలో మెడికల్ షాపులు ఉండగా కేవలం నాలుగే నాలుగు షాపుల్లో తనిఖీలు చేయడం కూడా చర్చకు దారి తీసింది. పలాస, పాతపట్నం, హిరమండలంతో పాటు మరో ప్రాంతంలో దాడులు చేశారు. ఈ మెడికల్ షాపుల ఎంపికను చూస్తుంటే డ్రగ్ కంట్రోల్ అధికారికి నచ్చని, అసోసియేషన్‌కు వ్యతిరేకంగా ఉన్న వారి షాపులపై దాడులు జరిగాయా అన్న అనుమానాలను కొందరు వ్యక్తపరుస్తున్నారు. ప్రతినెలా డ్రగ్ కంట్రోల్ అధికారి పర్యవేక్షణలో ఆ శాఖ సిబ్బంది ప్రతినిత్యం మెడికల్ షాపులను తనిఖీ చేయాల్సివున్నారు, అప్పుడప్పుడు, అక్కడక్కడ మాత్రమే తనిఖీలు చేస్తుంటారు. అసోసియేషన్‌కు చెందిన కొందరు నెలవారీ మామూళ్లు తీసుకుని డ్రగ్ కంట్రోల్ అధికారికి ఇస్తుంటారని మెడికల్ షాపుల నిర్వాహకులు కొందరు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ప్రధానంగా మెడికల్ షాపుల్లో అడ్డగోలుగా మత్తు నిచ్చి డ్రగ్స్ అమ్మకాలు చేస్తున్నారని ఇటీవల తనిఖీల్లో బయటపడింది. పలు మెడికల్ షాపుల్లో కాలం చెల్లిన మందులను గుర్తించగా, మరికొన్ని చోట్ల వైద్యులు ఇచ్చే మందుల చీటితో సంబందం లేకుండా అమ్మకాలు చేస్తున్నట్టు ఈ తనిఖీల్లో వెల్లడైంది. వైద్యుల చీటీ లేకుండా సైకోట్రోఫిక్, ఆల్ప్రాజోలమ్ డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్టు ఈ బృందం గుర్తించింది. ఇక కాలం చెల్లిన మందులను మందుల షాపుల నిర్వాహకులు ఏం చేస్తుంటారన్నది ఇప్పటికే రహస్యమే. ఏ మెడికల్ షాపుల్లోనూ బిల్లులు ఇచ్చిన దాఖలాలు లేవు. ఇవన్నీ ఎప్పటి నుంచో ఉన్నా ఆ శాఖ ఉన్నతాధికారి ఆదేశిస్తే తప్ప జిల్లా అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. శ్రీకాకుళం జిల్లాలో మందుల షాపులపై ఆపరేషన్ గరుడ పేరిట తనిఖీలు జరుగుతున్నాయన్న విషయం తెలుసుకున్న చాలా మంది తమ మెడికల్ షాపులను మూసివేశారు. ఈ అసోసియేషన్ నేతలు, సభ్యులకు సంబంధించిన షాపులైతే ముందుగానే షట్టర్లు దించేశారు. మరో విషయం ఏమిటంటే ఆపరేషన్ గరుడ కేవలం మెడికల్ షాపులకే పరిమితమైందని, వాటికి మందులు సరఫరా చేసే ఏజెన్సీలపై సంబంధిత అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవన్న విమర్శలు సర్వత్రా వినిపించాయి. మెడికల్ షాపులకన్నా ఏజెన్సీల నుంచే పెద్ద మొత్తాలు కొందరు డ్రగ్ కంట్రోల్ శాఖ అధికారులు అందుతుండడం వల్లే వాటివైపు చూడలేదని పలువురు బహిరంగంగా పేర్కొంటున్నారు. మందుల షాపుల్లో విక్రయాలు అత్యవసర సేవలు కిందకు వస్తాయి. కరోనా సమయంలో మందుల షాపుల నిర్వాహకులు ప్రాణాలు పణంగా పెట్టి సేవలు అందించారు. 24 గంటలు షాపులు తెరిచి రోగులకు అవసరమైన మందులు అందజేశారు. అయితే జిల్లాలో ఎక్కడా లేనట్టుగా పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో గత కొన్నేళ్లుగా మందుల షాపులను ప్రతి ఆదివారం పలాసలో ఒకటి, కాశీబుగ్గలో మరో షాపు మాత్రమే తెరిచేవారు. మిగతా షాపులు మూసివేయాలని అసోసియేషన్ పెద్దలు నిర్ణయించడంతో అదే కొనసాగింది. దీనిపై గతంలో చాలా విమర్శలు వచ్చినా ఓ నేత కనుసన్నల్లోనే ఇది జరుగుతుండడంతో ఎవరూ వ్యతిరేకంగా మాట్లాడలేకపోయారు. ఎవరైనా అడిగితే డ్రగ్ కంట్రోల్ అధికారులచే దాడులు చేయించడంతో వారు కూడా సైలెంట్ అయ్యారు. అసోసియేషన్ నేతపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో ఇకపై ప్రతి ఆదివారం షాపులు తెరుచుకోవచ్చని ఆ నేతే వాట్సాప్ గ్రూపులో పెట్టడం, ఆ తర్వాత జరిగిన పరిణామాలతో ఆ నేత తన పదవికి రాజీనామా చేస్తున్నానని బహిరంగంగా చెప్పడం చర్చనీయాంశమైంది. ఇక, శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో డ్రగ్ కంట్రోల్ శాఖకు సంబంధించిన కార్యాలయం ఉంది. కార్యాలయంలోకి అధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో ఎవరికీ తెలియదని, ఎవరైనా అడిగితే ఫీల్డ్ అనే సమాధానం వస్తుందని కొందరు మెడికల్ షాపుల నిర్వాహకులు చెబుతుంటారు. దీంతో తమ పనికావాలంటే అసోసియేషన్లను ఆశ్రయించక తప్పడం లేదు. ఏ పనైనా అసోసియేషన్ ద్వారానే చేయించుకోవాల్సివస్తోందని కొందరు పేర్కొంటున్నారు.



(శ్రీకాకుళం డ్రగ్ కంట్రోల్ కార్యాలయంలో కొందరు అవినీతి అధికారులు, వారికి అండగా ఉంటున్న శ్రీకాకుళం అసోసియేషన్ నేతల దందాపై త్వరలో జాతీయ వార్తలో పూర్తి కథనం)

# అరసవల్లిలో.. ఆక్టోపస్.. మాక్‌డ్రిల్





**శ్రీకాకుళం క్రైం, మార్చి 26 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆక్టోపస్ కమాండోలు మాక్‌డ్రిల్ నిర్వహించారు. సాధారణంగా ఆలయంలో స్వామివారి దర్శనం నిమిత్తం భక్తులు, ప్రముఖులు విచ్చేసిన సందర్భంలో అనుకోకుండా అత్యవసర పరిస్థితుల్లోనూ, ఉగ్రవాదులు దాడులు, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు భక్తులు, ప్రముఖులు , ప్రజలు ఏ విధంగా ప్రతిస్పందించాలన్న దానిపై, వారిని రక్షించే చర్యలో భాగంగా ఈమాక్ డ్రిల్ నిర్వహించారు. ఆక్టోపస్ అదనపు ఎస్పీ రాజా రెడ్డి ఆధ్వర్యంలో అక్టోఫస్ స్వాట్ సిబ్బంది సుమారు 40 మంది పాల్గొన్నారు. ఆలయ, పోలీస్ అధికారులు ఈ మాక్ డ్రిల్‌ను పర్యవేక్షించారు. ఆలయంలో భద్రత, అత్యవసర సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆక్టోపస్ కమాండోలు పలు సూచనలు చేశారు. ఈ మాక్ డ్రిల్ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజారెడ్డి, డీఎస్పీలు మదుసుధన్ రావు, జగ్గు నాయడు, శ్రీకాకుళం రూరల్, ఎస్బి ఇనస్పెక్టర్లు, పైడిపు నాయడు, ఇమ్మన్యూల్ రాజు, వర ప్రసాద్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# 13న గురుకుల ప్రవేశ పరీక్ష

**మందస, మార్చి 26(వార్త):** మందస మండలంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో బాలికలు చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షా తేదీని మార్పు చేశామని ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి తెలిపారు.

2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులందరికీ ఏప్రిల్ 13వ తేదీ ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు.

వచ్చేనెల 6వ తేదీన ఈ పరీక్ష నిర్వహిస్తామని ముందు ప్రకటించడం జరిగిందని, ఆ రోజు శ్రీరామనవమి దృష్ట్యా, ఆ తేదీని మార్పు చేశామని, ఈ విషయాన్ని అభ్యర్థులంతా గమనించాలని ఆమె సూచించారు.

# కిడ్నీ, రొమ్ము క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

-వ్యాధి ప్రాథమిక స్థాయిలో నయం చేసుకోవచ్చు -ఎమ్మెల్యే గౌతు శిరీష -మెగా వైద్య శిబిరం విజయవంతం - రోగుల చెంతకే స్పెషలిస్ట్ డాక్టర్లు




**పలాస, మార్చి 26(వార్త):** ప్రాథమిక స్థాయిలో నిర్ధారణ జరిగితే జబ్బును నయం చేసుకోవచ్చని, కిడ్నీ, రొమ్ము క్యాన్సర్ పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అప్రమత్తంగా ఉండాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు.

పలాస ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్లో సంస్థ సహకారంతో సీతమ్మధార, రాగోలు కిమ్స్ ఆసుపత్రిల సౌజన్యంతో సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మెగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. రోగుల వ్యాధి నిర్ధారణ చేసేందుకు 25 రకాల విభాగాల వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించారు. వ్యాధి నిర్ధారణ కోసం అధునాతనమైన సాంకేతిక పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవితం ఉండాలంటే ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలని, రోగుల చెంతకి స్పెషలిస్ట్ డాక్టర్లు రావడం మన ప్రాంత అదృష్టమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం కారణం చేత జబ్బులు ముదిరిపోయే వరకు వైద్యం చేయించకపోయి బాధపడుతున్న ప్రజల కోసం నేడు ఉచిత మెగా శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. బడుగు బలహీన వర్గాల (గ్లో) సంస్థ కార్యదర్శి వెంకన్న చౌదరి మాట్లాడుతూ స్కాన్ చేయడానికి ప్రత్యేక వాహనం తీసుకువచ్చి అవసరమైన విలువైన పరీక్షలు ఉచితంగానే తీశారని, దీర్ఘకాల రోగాలైన బిపి, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముందస్తు పరీక్షలు చేసుకోవడం ద్వారా ఉపయోగపడతాయని, కొన్ని రోగాలకు ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ఉపయోగపడతాయని చెప్పారు. ఉ

చిత వైద్య శిబిరం వినిగించుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్న చౌదరి నేతృత్వంలో ఈ మెగా ఉచిత శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ వైద్య నిపుణులు, టిడిపి నాయకులు, భారీ స్థాయిలో గ్రామీణ ప్రజలు, పట్టణ ప్రజలు స్థానికులు పాల్గొన్నారు.



# వార్షిక క్రెడిట్, జీవనోపాధుల ప్రణాళిక రూపొందించాలి




**మందస, మార్చి 26(వార్త):** రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆదేశాల మేరకు మహిళా స్వయం శక్తి సంఘ సభ్యులందరికీ వార్షిక క్రెడిట్, జీవనోపాదుల ప్రణాళికను తయారు చేసుకోవడానికి అదే సంఘాల నుండి విద్యావంతులై సంఘాల పట్ల అవగాహన, సేవాభావం ఉన్న వారిని ఎన్యుమరేటర్లుగా గుర్తించి వారికి యాప్ వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు.

మండల మహిళా సమాఖ్యలో స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి సంఘానికి జియో ఫ్యాన్సింగ్ చేయించి సేర్ఫ్ వారి ఆదేశాల మేరకు అందరు సభ్యులకు ఫేస్ రికగ్నైజేషన్ యాప్ లో నమోదు చేయించాలని తెలిపారు. ప్రతి సంఘ సభ్యురాలు కుటుంబ ప్రస్తుత ఆదాయ పరిస్థితిని గుర్తిస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వారికి కావలసిన జీవనోపాధి నిమిత్తం ఎంత లోన్ కావలెను అనే అంశాన్ని నిర్ధారించవలసి ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాంతమ్మ, స్త్రీనిధి మేనేజర్ సాయిరాం, అందరు క్లస్టర్ కోఆర్డినేటర్లు, వి.వో.ఏ లు పాల్గొన్నారు.

# నగిరి ఫల్గుణరావు అద్భుత ప్రతిభ

**మందస, మార్చి 26(వార్త):** మందస మండలంలోని సొండిపూడి గ్రామానికి చెందిన నగిరి ఫల్గుణరావు నైపుణ్యతకు సంబంధించి అద్భుత ప్రతిభ కనబరిచారు. హైదరాబాదు నగరం సికింద్రాబాద్ లోని హెరిటల్ మీనేర్వా గ్రాండ్ లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తులకు నైపుణ్యతకు సంబంధించి రెండు రోజుల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపగత అధ్యక్షుడు గంపా నాగేశ్వరరావు, ప్రెసిడెంట్ రామచంద్రుడు, వైస్ ప్రెసిడెంట్ మాధవి, సినిమా యాక్టర్ ప్రదీప్ పాల్గొనగా, శ్రీకాకుళం జిల్లా మందస మండలం సొండిపూడి గ్రామానికి చెందిన నగిరి ఫల్గుణ రావు అద్భుతంగా ప్రతిభ కనబరిచినందుకు ఆయనకు ప్రముఖ నటుడు ప్రదీప్ కుమార్, వ్యవస్థాపగత అధ్యక్షుడు గంపా నాగేశ్వరరావు చేతుల మీదుగా మోటివేషనల్ స్పీకర్, ట్రైనర్ గా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఫల్గుణరావుని ప్రశంసిస్తూ ఆయన సేవలు విద్యార్థులకు, సమాజానికి చాలా అవసరం ఉందని, అదేవిధంగా ఆయన నైపుణ్యం ద్వారా సమాజంలో అవగాహన పెంచాలని చెప్పారు. ఫల్గుణరావు ప్రతిభ వల్ల ఆ ట్రైనింగ్ లో ఆయనకు మొదటి స్థానం రావడం చాలా గర్వకారణమని వారు అభినందించారు.









# ఆడపిల్లల సంరక్షణకు శక్తి యాప్

**పలాస, మార్చి 26(వార్త) :** ఆపదలో ఉన్న ఆడపిల్లల సంరక్షణకై శక్తి యాప్ సద్వినియోగం చేసుకోవాలని శక్తి టీం సబ్ ఇన్స్పెక్టర్ జి.రాజేష్ అన్నారు. బుధవారం పలాస మండలంలోని బ్రాహ్మణతర్లా - జడ్పి ఉన్నత పాఠశాలలో శక్తిఆప్ పై అవగాహన కార్యక్రమాన్ని శక్తి టీం ఎస్ఐ జి.రాజేష్ కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరిచే ఈ శక్తి ఆప్ ని డౌన్లోడ్ చేయించి ఆపదలో ఉన్నప్పుడు ఎస్ఓఎస్ ఆన్ చేస్తే వెంటనే కంట్రోల్ రూమ్ కి వీడియో వెళ్లి పోలీసులు వస్తారని అన్నారు. ఇది ఆపదలో ఉన్న మహిళలు, పిల్లలకు చాలా ఉపయోగకరం. డ్రగ్స్, మద్యం, మత్తు పదార్థాలుకి బానిస అవ్వడం వలన మనతో పాటు కుటుంబాలు నాశనం అవుతాయని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వీ. రమణారావు ఆధ్వర్యంలో జరగగా ఉపాధ్యాయ సిబ్బంది.. ఈశ్వర రావు, కొయ్యల శ్రీనివాసరావు, సుధా కుమారి, చంద్రశేఖర్, శివప్రసాద్, రజని కుమారి, జ్యోతమ్మ, క్రిష్ణవేణి, లక్ష్మి భాయి, విష్ణాచారి పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ముగింపు

**మందస, మార్చి 26(వార్త):** మందస మండలంలోని 169 అంగన్ వాడీ కేంద్రాలకు సంబంధించిన కార్యకర్తలకు మూడు రోజుల పాటు ఇచ్చిన శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఐసీడీఎస్ సీడీపీఓ కె.వసుంధరాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు బి. మంగమ్మ, సీహెచ్ రామలక్ష్మి(చిట్టి), పి.జయలక్ష్మిలు కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. మందస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో పీబీ, పీబీలో పిల్లలకు పోషణ-నవచేతన, పోషణ, ప్రిస్కూల్-ఆదర్శశీల, పిల్లల సమగ్రాభివృద్ధి, 1000రోజుల కేర్, గ్రోత్, దివ్యాంగ పిల్లల లక్షణాలను గుర్తించడంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం పీబీ, పీబీ సర్టిఫికెట్లును అందజేశారు.

# 10 మద్యం సీసాలతో మహిళ అరెస్టు

**ఇచ్ఛాపురం, మార్చి 26(వార్త):** కవిటి మండలం ఇద్దివాని పాలెం కి చెందిన వంక ఊర్మిల అనే మహిళ ను 10 మద్యం సీసాలు తో అరెస్ట్ చేసినట్లు ప్రొహిబిసన్ అండ్ ఎక్సైజ్ సి ఐ పి.డి. ప్రసాద్ చెప్పారు.

# యూడీఎఫ్ సూర్యంనకు ఆర్థిక సాయం

**మందస, మార్చి 26(వార్త):** యూడీఎఫ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన బి.సూర్యం ఆరోగ్యపరంగా ఇబ్బంది పడుతున్నారు. ఆయనను యూడీఎఫ్ కార్యవర్గ సభ్యులు ఆర్థికంగా ఆదుకోవాలనుకుని నిర్ణయించుకున్నారు. మిత్రులు, యూడీఎఫ్ వాట్సాప్ గ్రూప్ తో పాటు కొంతమందిని సంప్రదించి రూ.1,15,750లు విరాళాలు ద్వారా సేకరించారు. ఈ లక్షా పదిహేను వేల ఏడు వందల యాభై రూపాయలను శ్రీకాకుళంలో ఆయన ట్రీట్ మెంట్ తీసుకుంటున్న కిమ్స్ హాస్పిటల్ కు వెళ్ళి, సూర్యం కుటుంబసభ్యులకు యూడీఎఫ్ కార్యవర్గ సభ్యులు అందజేశారు. యూడీఎఫ్ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఇచ్చిన పిలుపు మేరకు ఆర్థిక సహాయం అందజేసిన గ్రూప్ సభ్యులు, ఇతర సేవా సంస్థలతో పాటు ప్రతి వ్యక్తికీ పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు. మిత్రులు అందించిన ఆర్థిక సహాయం కాదని, అందరూ సూర్యం ను ఆశీర్వదించినట్లేనని అన్నారు. అందరి ఆశీర్వాదాలుతో సూర్యం త్వరగా కోలుకోవాలని దేవుణ్ణి వేడుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూడీఎఫ్ అధ్యక్షుడు సొర్ర రామారావుతో పాటు గౌరవ అధ్యక్షుడు బత్తిన లక్ష్మణ్, సొర్ర జానకిరావు, కార్యదర్శి దున్న గాంధీవర్మ, బెరమల జీవన్, పిచ్చుక కిరణ్, మడియా ప్రశాంత్ ఉన్నారు.



జాతీయ
శ్రీకాకుళం

# స్వర్ణనంది అవార్డుకి ఎంపికైన మచ్చ నీలాద్రి రెడ్డి



**ఇచ్ఛాపురం, మార్చి 26(వార్త):** మెగా హెల్పింగ్ ఫౌండేషన్ జాతీయ ప్రతిభ పురస్కారాలుకు ఎంపికైన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం టి బరంపురం జైపూర్ కొత్తూరు గ్రామానికి చెందిన జానపద కళాకారుడుమచ్చ.నీలాద్రి రెడ్డిఎంపికయ్యారు. సంగీత కలలో కీబోర్డ్ మరియు హార్మోనియం కోలాటం పాండురంగ భజన మరెన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేసిన కళాకారుడు నీలాద్రికి స్వర్ణ నంది అవార్డు కు మెగా ఫౌండేషన్ వ్యవస్థాపకరాలు శిరీష రెడ్డి ఎంపిక చేశారు. బిర్లా ఆడిటోరియం (హైదరాబాద్)లో ఈ అవార్డు ను ప్రధానం చేయనున్నారు.



## అలరించిన నాట్య ప్రదర్శన

**ఇచ్ఛాపురం, మార్చి 26(వార్త):** గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి కృష్ణశిల విగ్రహ ప్రతిష్ట ఆరవ వార్షికోత్సవం శుభ సందర్భంగా అమ్మవారికి ఎదురుగా వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ సంస్థ అధ్యక్షులు చిన్నాగురుస్వామి దంపతులు నాట్య గురువులు శృతి పట్నాయక్ దట్టి కావ్య నీలాపు శైలు సిల్లాపూజ చాట్ల జయలక్ష్మి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రీతి లిఖిత దీపిక మధు శ్రీ పల్లవి పాల్గొని అమ్మవారికి కూచిపూడి నృత్య అర్చన ఐగిరి నందిని అష్టలక్ష్మి వైభవం మహా కనకదుర్గ శివతాండవం అమ్మవారి హారతి పాటలకు చక్కని హావభావాలతో భక్తులనందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు చిన్నారులకు ఆలయ అభివృద్ధి సభ్యులు ఘనంగా సత్కరించారు.అలాగే జాతీయ కళాకారులు భారతీ రమేష్ సంగీత విభావరి అలరించింది.

## ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

**శ్రీకాకుళం మార్చి 26(వార్త):** కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై చేస్తున్న హత్యాకాండను ఆపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. బిజెపి ప్రభుత్వం లో ఆపరేషన్ కగార్ పేరుతో 200 మందికి పైగా సామాన్య, ఆదివాసి మహిళలను, పిల్లలను , యువకులను పొట్టన పెట్టుకున్నారని తెలిపారు. 300 మంది కి పైగా మావోయిస్టులను కేంద్ర సైనిక బలగాలు ఎన్కౌంటర్ పేరుతో హతమార్చాయని ఆరోపించారు. గిరిజనుల ఆధీనంలో ఉన్న అటవీ భూముల్లో విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులు దోపిడీ చేయకుండా ప్రాణాలను పణంగా పెట్టి కాపాడుకుంటున్న ఆదివాసి, గిరిజన ప్రజలను మావోయిస్టులుగా ముద్ర వేసి వారిని అడవి నుండి బలవంతంగా గెంటివేసే కుట్రలో భాగంగానే అంతర్యుద్ధం పేరుతో జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న దుర్మార్గాలను ఆపాలని, ఆదివాసీలు, గిరిజనుల జీవనానికి ఆటంకం కలిగించవద్దని కోరారు.



## అర్బన్ లేఅవుట్ లబ్ధిదారులు
# ఆందోళన చెందొద్దు

**- పలాస మున్సిపల్ కమిషనర్ రామారావు**

**పలాస, మార్చి 26(వార్త):** అర్బన్ లేఅవుట్ లబ్ధిదారులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు అన్నారు. బుధవారం పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన అర్బన్ హౌసింగ్ గ్రీవెన్స్ లో ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి మరియు టిడ్కో ఇండ్ల కేటాయింపులకు సంబంధించి పలు దరఖాస్తులు వచ్చాయని, ముఖ్యంగా అర్బన్ లే అవుట్ లలో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు సమస్యలపై దరఖాస్తు చేసుకొని యున్నారని తెలిపారు. మొత్తం 09 దరఖాస్తులు రాగా, అందులో కొన్నిసమస్యలను సంబంధిత శాఖాధికారి కారులతో స్వయంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడి పరిష్కరించారు . టిడ్కో ఇండ్లకు సంబందించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా రావలసి ఉందని అందువలన టిడ్కో ఇండ్ల కొరకై సొమ్మును డిపాజిట్ చేసిన వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని కమిషనర్ తెలిపారు అర్బన్ హౌసింగ్ కి సంబంధించి లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



# సెల్ఫ్ డిఫెన్స్‌తోనే స్వీయ రక్షణ



**శ్రీకాకుళం, మార్చి 26(వార్త):** ఆపద సమయంలో విద్యార్థులు, మహిళలకు పోలీస్ వారి తక్షణ సహాయం, సహకారం పొందేలా శక్తి యాప్ అభయ అస్త్రంగా పనిచేస్తుందని కావున ప్రతి మహిళ,విద్యార్థి మీ యొక్క ఫోన్ లో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకుని పోలీసు వారు అత్యవసర సహాయ సహకారాలు పొందాలని ఎస్సై వాసు దేవ రావు సూచించారు. ఆత్మరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) పై శిక్షణ పొంది నేర్చుకోవడం ద్వారా ఆపద సమయంలో విద్యార్థులు మీకు మీకు గా స్వీయ రక్షించు కోగలరని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ గారు ఆదేశాల మేరకు బుధవారం శ్రీకాకుళం రెండవ శక్తి టీం ఎస్సై వాసుదేవ రావు రిమ్స్ మెడికల్ కళాశాలలో శక్తి బృందాలు సిబ్బంది సందర్శించి విద్యార్థినులకు క్షత్రియపు యొక్క ఆవశ్యకత ఉపయోగం గురించి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికల భద్రత కొరకు శక్తి యాప్ ను ప్రవేశపెట్టడం జరిగింది అని తెలిపారు. విద్యార్థును లతో సెల్ఫ్ డిఫెన్స్ (స్వీయ రక్షణ ) కార్యక్రమాన్ని చేపట్టి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై వాసు దేవ రావు మాట్లాడుతూ....ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, ఇతర హింసాత్మక సంఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది అని కావున జిల్లాలో ప్రతీ ఒక్క మహిళ,గృహిణిలు విద్యార్థినిలు,బాలికలు వారి యొక్క ఫోన్ల నందు ఈ శక్తి యాప్ ను నిక్షిప్తం చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం, సహకారం పొందాలని తెలిపారు. టెక్కలి కాశిబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ఆయా శక్తి బృందాల సిబ్బంది కళాశాలలు పాఠశాల సందర్శించి విద్యార్థులకు శక్తి ఆప్ యొక్క ఆవశ్యకత ఉపయోగాలు గురించి తెలియజేసి ప్రతి ఒక్కరు ఆత్మ రక్షణ శిక్షణ పొందాలని ఆపద సమయంలో స్వీయ రక్షించుకోవచ్చు అని అత్యవసర సమయంలో శక్తియాస్ ద్వారా పోలీసు వారి తక్షణ సాయం పొందగలరని తెలియజేశారు.



# రోడ్డు ప్రమాదంలో గొల్లమాకనపల్లి యువకుడి మృతి

**-పెళ్లైన నెల రోజులకే మృత్యువాత**

**పలాస, మార్చి 26(పలాస) :** పలాస మున్సిపాలిటీ పరిధిలోని మొగిలి పాడు నుంచి బుల్లెట్ బైక్ పై గొల్లమాకన్న పల్లికి వెళ్తున్న యువకుడు కోసంగిపురం బ్రిడ్జి పై ఉన్న రక్షణ గోడను ఢీ కొట్టి హైవే రోడ్డు పై ఎగిరి పడినట్లు పోలీసుల కథనం. ఈ ప్రమాదంలో పలాస మండలం గొల్లమాకన్న పల్లి గ్రామానికి చెందిన కోరాడ మధుసూదన్ (27 ) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# వేర్వేరుగా మంత్రి అచ్చెన్న జన్మదిన వేడుకలు



మెళియాపుట్టి మార్చి 26(వార్త): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు వేర్వేరుగా నిర్వహించారు. మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి, మాజీ మండలధ్యక్షులు సలాన మోహనరావుల ఆధ్వర్యలలో బుధవారం నాడు వేర్వేరుగా మంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కింజరాపు కుటుంబం ప్రజలకు చేసిన, చేస్తున్న సేవలు, అభివృద్ధి వారి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు అన్నారు. అచ్చన్నాయుడు జననేతని కార్యకర్తలకు కష్టమొస్తే ముందుండే దర్శినిక నాయకుడని పలువురు కోనియాడారు. క్రమశిక్షణకు మారుపేరు అని చెప్పే దేశం పార్టీలో మంత్రి అచ్చన్నాయుడు జన్మదినం సందర్భంగా వేరువేరుగా జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో నిర్వహించడం పై పార్టీకి చెందిన బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవారు గ్రూపులను పెంచి పోషిస్తారా? లేదా గ్రూపులను ఒక త్రాట మీదకి తీసుకుని వస్తారా అని పలువురు ఎదురుచూస్తున్నారు. మరి పార్టీ అధిష్టానం ఎలా వ్యవహారం తీర్చిదిద్దుతుందా అని, ఆ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలతో పాటు రాజకీయ విశ్లేషకులు సైతం పలువురు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# 29న శ్రీకాకుళంలో కవి సమ్మేళనం

**శ్రీకాకుళం, మార్చి 26(వార్త):** ఉగాది సందర్భంగా ఈ నెల 29 వ తేదీ సాయంత్రం 4 గం.లకు స్థానిక శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కవి సమ్మేళనం నిర్వహించ నున్నారు.ఈ విషయాన్ని సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వర రావు, ఆర్.వి.రమణమూర్తి లు సోమవారం ఒక ప్రకటన లో తెలియజేసారు. కవి సమ్మేళనంలో పాల్గొనే కవులకు, కవయిత్రులకు సత్కారం ఉంటుంది . ఆసక్తిగల కవులు, కె.సంతోష్ కుమార్ ఫోన్ నంబరు 6303136182కు ఫోన్ చేసి తమ పేర్లను 28.3.25 వ తేదీ లోగా నమోదు చేసుకొనవలెనని వారు ఆ ప్రకటనలో కోరారు.

# ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

**-ఎమ్మెల్యే శిరీష**



**పలాస, మార్చి26(వార్త):** నిరుద్యోగ్య నివారణ కోసం కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస వెలుగు కార్యాలయంలో జాబ్ మేళా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులు ఉపాధి లభించేందుకు కృషి చేయాలని, నిరాశ చెందకుండా కృషి చేస్తే ఉపాధి లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగాలు రావాలంటే అందుకే అంతా కష్టపడాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేనందున వలసలు పోతున్నారని, ఇందుకోసం జాబ్ మేళా ఏర్పాటు చేశామని అన్నారు. జాబ్ మేళాకు 72 మంది హాజరవుగా, 53 మంది ఎంపికయ్యారని వెలుగు ఏపిఎం జంభవతి వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జెడియం ఎస్ రమణమూర్తి, టిడిపి సీనియర్ నాయకులు దువ్వాడ శ్రీకాంత్, కుత్తుం లక్ష్మణ్, దువ్వాడ సంతోష్, డి పి ట్రైనర్ కే కవిత, జెసివో ఎల్ నాగేశ్వరరావు, బ్లూ స్టార్ హెచ్ఆర్ రాజు, త్రి సిటీ హెచ్ఆర్ శ్రీనివాస సాహు, ఫ్యూజియన్ మేనేజర్ సురేంద్ర సాహూ ఎంఎంఎస్ అధ్యక్షులు శాంతమ్మ, ఎంఎంఎస్ కార్యదర్శి కే పార్వతి, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

# యువ పార్లమెంట్ పోటీలకు బీఆర్ఏయూ విద్యార్థులు



**శ్రీకాకుళం, మార్చి 26(వార్త):** ఎచ్చెర్ల డా. బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు ఎస్.సాయిప్రదీప్(ఈసీఈ విభాగం, డా. బీఆర్ఏయూ) జి. రాజ రాజేశ్వరి(కాకినాడ ఆదిత్య కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటరీ)లు జాతీయ యువ పార్లమెంట్-2025 పోటీలకు రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఇటీవల విశాఖలోని గీతం విశ్వవిద్యాలయంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో వీరిద్దరు పాల్గొని ప్రతిభ కనపరిచారు. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ను జాతీయ స్థాయిలో నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో అర్హత సాధించేందుకుగాను జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలు ముందుగా నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన పలు కళాశాలలు, వర్శిటీలు విద్యార్థులు పాల్గొనగా డా.బీఆర్ఏయూ తరుపున వీరిద్దరు రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరగనున్నాయి. కాగా, ఈ విద్యార్థులకు బీఆర్ఏయూ వైస్-ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని బుధవారం ప్రత్యేకంగా అభినందనలు తెలిపి జాతీయ స్థాయి వరకూ ప్రతిభ కనపరచాలని సూచించారు. వర్శిటీ ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా. డి.వనజ, ఎల్.మోహనరావు, టి.భవాని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కొండను కరిగించేస్తున్నారు..!

**-కేదారిపురము కొండను తవ్వేస్తున్న అక్రమార్కులు -అక్రమంగా మట్టి, కంకర తవ్వకాలు - అడ్డుకున్న తహసీల్దార్ -లారీలు సీజ్**

**పలాస, మార్చి26(వార్త):** ప్రకృతి ప్రజలకు ఇచ్చిన కొండలను చెరువులను సంరక్షించుకోవలసిన ప్రజలు అధికారులు అవసరం మువంతైనా ఉందని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల పలాస కాశిబుగ్గలో అక్రమ పద్ధతిలో చెరువులు కొండలు ఆక్రమించుకొని వారి స్వార్ధానికి ఉపయోగించుకొని ఆర్థిక ఆర్జన కోసం నిబంధనలు మీరుతున్నారు. చిన్న రాజకీయ నాయకులు అండతోపాటు కొందరు స్థానిక రెవెన్యూ అధికారులు సహకారము తో పలాస మండలం కేదారి పురము లో ఉన్న కొండను అక్రమంగా కంకణను తొలగించే కార్యక్రమం చేస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పలాసలో అక్రమ పద్ధతిలో కొండల తవ్వకాలు అలాగే చెరువులు ఆక్రమణలు పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గత ఏడు నెలలుగా మౌనంగా ఉన్న ఆక్రమణదారులు ఒక రెండు రోజుల నుంచి పలాస లోని. ఉదయపురము సమీప ము లోని కొండలో అక్రమ పద్ద తి లో కొండను తవ్వేస్తున్నారు.రోజు లక్ష ల్లో కంకర్, మట్టి. తవ్వకాలు చేస్తు కోట్ల రూపాయలు అర్జన లో మునిగి పోయారు.





## అడ్డుకున్న తహసీల్దార్

గ్రావెల్ తరలిస్తున్న మూడు టిప్పర్లు సీజ్ చేసారు నిబంధనలకు విరుద్ధంగా కొండపై ఉన్న గ్రావెల్ మట్టిను అక్రమంగా తరలిస్తున్న వారిపై పలాస తాసిల్దార్ నియంత్రించి చర్యలు తీసుకున్నారు.పలాస మండలం కేదారి పురంలో అక్రమంగా కొండలను తొలిచేస్తున్న అక్రమార్కులపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి తన సిబ్బందితో కలిసి చెరువులను, కొండలను తొలి చేస్తున్న మట్టి మాఫియా పై ఉక్కు పాదం మోపారు.పలాస మండలం కేదారిపురంలో అనుమతులు లేకుండా అక్రమ త్రవ్వకాలు చేపట్టి మట్టి, గ్రావెల్ ను తరలిస్తున్న ముగ్గురిని పట్టుకున్నారు.పలాస మండలం రాజగోపాల పురానికి చెందిన మూడు టిప్పర్లను సీజ్ చేశారు.సీజ్ చేసిన టిప్పర్లను పలాసతహశీల్దార్ కార్యాలయానికి తరలించారు.మట్టి , గ్రావెల్ ను త్రవ్వేసి అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురు ఆక్రమణ దారులపై ఆర్డీవో వేంకటేష్ ఆదేశాల మేరకు రూ.70 వేల అపరాధ రుసుం విధించినట్లు పలాస తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి వెల్లడించారు.

# భూసమస్యలు లేకుండా నిర్మాణం చేపట్టాలి



**మెళియాపుట్టి, మార్చి 26 (వార్త):** మెళియాపుట్టిలోని ఏకలవ్య పాఠశాలకు సంబంధించి ప్రహరీ నిర్మాణం జరుగుతున్న దృశ్య భవిష్యత్ కాలంలో వీటికి అనుకుని ఉన్న ఉద్దనం నీటి ప్రాజెక్టు, ఇతరత్రా ఎవరికి ఎటువంటి భూ సమస్యలు లేకుండా నిర్మాణ ప్రక్రియ చేపట్టాలని టెక్కలి ఆర్డిఓ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం నాడు ఏకలవ్య పాఠశాల, ఉద్దానం నీటి ప్రాజెక్టలకు సంబందించి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెళియాపుట్టి రెవిన్యూ కొండకు అనుకుని ఉన్న ఉల్లాసపేట సమీపంలోని ఏకలవ్య పాఠశాలకు ఉద్దనం ప్రాజెక్టలకు ప్రభుత్వం భూమిని కేటాయించారు. అయితే ఏకలవ్య పాఠశాల నిర్మాణం అలస్యం కావటంతో ఉద్దనం ప్రాజెక్టుకు సంబందించి పైపులు లైన్లు ఏకలవ్య పాఠశాల స్థలంలో ఏర్పాటు చేయటం వల్ల ప్రహరి నిర్మిస్తే భవిషత్తులో ఇబ్బందులు వస్తాయనే ఉద్దశంతో పరిశీలించినట్లు తెలిపారు. ఉద్దనం ప్రాజెక్టు వైపు ఒక గేటు ఏర్పాటు చేసుకోని దాన్ని తాళం ఎకలవ్య పాఠశాల యాజమాన్యాకి ఇవ్వాలని, ఇలా చేయటం వల్ల భవిష్యత్తు కాలంలో ఎవరికి ఇబ్బందులు తలెత్తవని అలాగే ఏకలవ్య పాఠశాలకు నీరు ఇవ్వలన్నారు. అనంతరం ప్రాజెక్టను పరిశీలించారు. ఆర్డీవో తోపాటు స్థానిక తహసీల్దార్ పాపారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఘనంగా మంత్రి అచ్చెన్న జన్మదిన వేడుకలు



**కొత్తూరు,మార్చి 26 ( వార్త ) :**గత కొద్దిరోజుల క్రితం వైసిపి నుంచి టీడీపీ లోకి చేరిన కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణ రావు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు గోగుల వరప్రసాద్ నాయుడు, పారాపురం మాజీ ఎంపీటీసీ సభ్యులు కుంచాల నూకరాజు, సర్పంచ్ ప్రతినిధి కుంచాల తవిటి నాయుడు, యువ నాయకులు పప్పల కేశవ రావు చేరిన తరువాత కొద్ది రోజులకే రాష్ట్ర మంత్రి వర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు గారి 54వ జన్మదినం రావడంతో ఈ యొక్క వేడుకలను కొత్తూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర మంత్రి వర్యులు జన్మదిన వేడుకలు రావటంతో కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి పడాల లక్ష్మణ రావు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని తన వర్గంతో స్థానిక పడాల వీధిలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు పుట్టినరోజు వేడుకులు ఘనంగా జరిపించారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు అగతముడి బైరాగి నాయుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ వేడుకల్లో భాగంగా టీడీపీ సీనియర్ నాయకులు అగతముడి బైరాగి నాయుడుతో కేక్ కటింగ్ చేయించి తినిపించారు. అనంతరం మండల స్థాయి నాయకులు, కార్యకర్తలకు కేక్ పంచి పెట్టి అనంతరం కూల్ డ్రింక్స్,వాటర్ బాటల్స్, స్వీట్స్ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల సీనియర్ నాయకులు అగతముడి మాధవరావు, మాతల గాంధీ,అగతముడి అరుణ్ కుమార్, లోతుగడ్డ భగవాన్,నాగల్ల అప్పన్న, టొంపల తిరుపతి, లోతుగెడ్డ జనార్దన, పెద్దిన కులశేఖర్ ఆల్వార్, పెద్దిన అమర్ నాథ్, ముగితి కృష్ణ బ్రదర్స్,చింతాడ కోటి, కర్నెన రమణ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# చిలకపాలెంలో బెట్టింగ్ వ్యతిరేక సంకల్ప దీక్ష

**ఎచ్చెర్ల, మార్చి 26 (వార్త):** మండలంలోని చిలకపాలెం జంక్షన్ సమీపంలో బెట్టింగ్ వ్యతిరేక సంకల్ప దీక్షను సామాజికవేత్త మీసాల భానోజీరావు బుధవారం చేపట్టారు. అనేక జీవితాలను బలిగొం టున్న బెట్టింగ్ యాప్‌లను, వాటిపై ప్రచారాలను పూర్తిగా నిషేధించా లని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వీటిపై ప్రత్యేక దృష్టి సారిం చాలని ఆయన కోరారు. ఈ దీక్షకు పలువురు మద్దతు తెలిపారు.



## ఎస్సీ వర్గీకరణతో రెల్లి కులానికి అన్యాయం

**హిరమండలం, మార్చి 26 (వార్త):** ఎస్సీ వర్గీకరణలో రెల్లి కుల వర్గానికి అన్యాయం జరిగిందని దీనిపై ప్రభుత్వంతో పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఉందని రమేష్, శ్యామ్, బాలు అన్నారు. హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో జైభీమ్ యువజన సేవా సంఘం ఆధ్వ ర్యంలో బుధవారం న్యాయపోరాట సమితి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో రెల్లి కుల వర్గానికి చాలా అన్యాయం జరిగిందన్నారు. కేవలం ఒక్క శాతమే కేటాయించారని, దీంతో ఎంతో నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఒక శాతం నుంచి ఐదు శాతానికి పెంచాలని, లేకుంటే భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తా మన్నారు.

# అబద్ధాలు చెప్పివుంటే..

# అధికారం మాదే.!

* ప్రజలను మోసం చేసి గెలిచారు
* 40శాతం ఓట్లు పొందాము
* మూడు పార్టీలు కలిసి మమ్మల్ని ఓడించారు
* ప్రజా గొంతుకై మండలిలో పోరాడా
* ఫలితంగా ధాన్యం టార్గెట్లు వచ్చాయి
* తొమ్మిది సార్లు గెలుపొంది నియోజకవర్గానికి ఏం చేశారు..?
* ఒకసారి అధికారంలోకి వస్తే 1000 కోట్లు ఖర్చు పెట్టాం
* కిడ్నీ బాధితులకు 10000 పింఛన్ ఇచ్చాం
* అసెంబ్లీలో అచ్చం నాయుడు అబద్ధాలు చెప్పారు
* వ్యవసాయ మంత్రిగా జిల్లా రైతులను గాలికి వదిలారు
* ఇచ్ఛాపురంలో డయాలసిస్ సెంటర్ ప్రారంభించండి
* పరికరాలన్నీ మూలకు చేరాయి
* మా కార్యకర్తలను పోలీసులు హింసిస్తున్నారు
* ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాము
* రూరల్ ఎస్సైపై ఇచ్ఛాపురం సిఐకు వైకాపా నేతలు ఫిర్యాదు
* శాసనమండలి సభ్యులు నర్తు రామారావు
* నియోజకవర్గ నేతలు ఐక్యంగా మీడియా సమావేశం

**ఇచ్ఛాపురం/కంచిలి, మార్చి 26(వార్త):** కల్లబొల్లి కబుర్లు చెప్పి ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి ఉంటే మరోసారి తాము అధికారంలో ఉండే వాళ్ళమని, మా నాయకుని లక్షణం.. లక్ష్యం అది కాదు అని శాసనమండలి సభ్యులు నర్తు రామారావు అన్నారు. ఆయన కంచిలిలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులు సమావేశాన్ని నిర్వహించారు. 20 రోజులపాటు కౌన్సిల్లో జరిగిన సమావేశాల వివరాలను వరుస క్రమంలో వెల్లడించారు. తాను జిల్లా సమస్యల పట్ల, ఇచ్ఛాపురం నియోజకవర్గం లో ఉన్న ముఖ్యమైన సమస్యల పైన ప్రజా గొంతుకై తన స్వరాన్ని వినిపించానని ఈ సందర్భంగా చెప్పారు. ఆయన కౌన్సిల్లో మాట్లాడిన విషయాలను అంశాల వారీగా వివరించారు. వ్యవసాయ శాఖ మంత్రి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ 90 రోజులు నిలిచిపోయింది. మండలి లో ప్రస్తావించిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన జిల్లా యంత్రాంగంలో కదిలికి వచ్చింది. సుమారు 40వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు గడిచిన రెండు రోజులుగా జరిగింది. సుమారు 732 మంది రైతులకు లబ్ధి జరిగింది. ఇది రైతుల పట్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అని అన్నారు. ఐదు సంవత్సరాల వైకాపా పదవీకాలంలో, రెండు సంవత్సరాలు కోవిడ్ కారణంగా ఆర్థిక ఇబ్బందులు నెలకొన్నప్పటికీ.. ఉద్దానం ప్రాంతంలో ఉన్న కిడ్నీ సమస్యల పరిష్కారానికి ఇచ్ఛాపురం నియోజకవర్గానికి దాదాపు 800 కోట్లు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఖర్చు పెట్టింది. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మొదటిసారిగా 10,000 రూపాయల పింఛన్ తీసుకువచ్చింది. అయినప్పటికీ, అసెంబ్లీ వేదికగా అచ్చం నాయుడు అబద్ధాలు చెప్పారని తెలిపారు. దీనిని తీవ్రంగా ఖండిస్తూ, కౌన్సిల్లోనూ.. మీడియా పాయింట్ వేదికగా అచ్చం నాయుడు విమర్శలను తిప్పికొడుతూ.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసినటువంటి మేలును ప్రజలకు వివరించడం జరిగింది.

డయాలసిస్ యూనిట్ లు పెంచాల్సిన ఆవశ్యకతను వివరించాను. పదివేల పింఛన్ను మరో ఐదు వేలకు పెంచి 15000 ఇవ్వాలని డిమాండ్ చేశానన్నారు. లోకేష్ తీసుకొస్తున్న విద్యాసంస్కరణలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఏర్పడుతున్న ఇబ్బందులు, గ్రామాల్లో జరుగుతున్న ఆందోళనలను కౌన్సిల్లో చర్చించా. ఈ అంశాల పైన గ్రామస్థాయిలో పార్టీ నాయకులతో కలిపి కార్యచరణను తయారు చేస్తాము. గ్రామస్థాయిలో ఉన్న ఆందోళనను, ఆ తీవ్రతను ప్రభుత్వం తీసుకువెళ్లడం జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనమండలి సభ్యుడిగా తన వంతు బాధ్యతను నిర్వర్తించానన్నారు.

బెల్టు దుకాణాల నిర్వహణ అధికార పార్టీ నాయకులకు కనుసన్నల్లో జరుగుతున్న విధానాన్ని కౌన్సిల్లో ఉంచాను. కిందటి నెల 12వ తేదీన ఇచ్ఛాపురం మండలంలోని కృష్ణ వైన్స్ నుంచి 1572 మద్యం బాటిళ్లు బెల్ట్ దుకాణానికి వెళ్తూ పట్టుబడితే, కేసు కూడా నమోదు జరిగింది. అయినప్పటికీ, సంబంధిత మద్యం దుకాణం పై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ అంశం పైన మండలిలో ఒక క్వశ్చన్ లేవనెత్తానని స్పష్టం చేశారు.

ఇచ్ఛాపురం పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంశధార నది జలాలను బహుదకు అనుసంధానం చేస్తానని మాటిచ్చారు. ఈ వార్షిక బడ్జెట్లో ఈ రెండు నదులు అనుసంధానానికి సంబంధించి ఒక రూపాయి కూడా కేటాయింపు చేయలేదు. ఈ విషయాన్ని కూడా సభ దృష్టికి తీసుకు వెళ్లానని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు విషయం ప్రతి సందర్భంలోనూ చెబుతున్నాము. ప్రజలు కూడా గ్రహిస్తున్నారు. ఎన్నో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం ప్రజలను నిరంతరం మోసం చేస్తూ కాలక్షేపం చేస్తుందని మీడియా ద్వారా నియోజకవర్గ ప్రజలకు తెలియజేస్తున్నట్టు వివరించారు.

అంతకుముందు ఇచ్ఛాపురం నియోజకవర్గం లోని ముఖ్యమైన నేతలు అంతా కలిసి ఇచ్ఛాపురం సర్కిల్ అధికారి చిన్నం నాయుడును కలిశారు. ఇచ్ఛాపురం మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పైన జులుం ప్రదర్శిస్తున్నారని, బెదిరింపులకు పాల్పడి రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని బెదిరిస్తున్నట్టు రూరల్ ఎస్ఐ వైఖరిని సీఐ ముందుకు తీసుకువెళ్లారు. ఇదే పరిస్థితి కొనసాగిస్తే, నియోజకవర్గ స్థాయిలో ఆందోళన చేస్తామని సిఐ దృష్టికి తీసుకువెళ్లారు. అధికారాలు మారుతూ ఉంటాయని, ఏవీ శాశ్వతం కాదని విషయాన్ని పోలీసులు గ్రహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గానికి చెందిన ముఖ్యమైన నాయకులు జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ, సీడాఫ్ మాజీ చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్ పర్సన్ ప్రతినిధి పిలక సంతోష్ రెడ్డి, ఎంపీపీలు బోర పుష్ప, డాక్టర్ నిమ్మన దాసు, కడియాల ప్రకాష్, పైల దేవదాస్ రెడ్డి, జడ్పిటిసి ప్రతినిధులు ఇప్పిలి కృష్ణారావు తో పాటు నాలుగు మండలాల కన్వీనర్లు, సంస్థగతంగా వివిధ హొదాలలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546